క్లుప్తంగా

శ్రావ్యంగా సాగిన గాత్ర కచేరి



విజయవాడ కల్చరల్: నారదగాన సభ ఆధ్వర్యంలో శనివారం బెంగళూరుకు చెందిన డాక్టర్ ఎంవీ శ్రీనివాస మూర్తి నిర్వహించిన శాస్త్రీయ సంగీత కచేరి మధురంగా సాగింది. సంగీత త్రిమూర్తులు సద్గురు త్యాగరాజ స్వామి, ముత్తుస్వామి దీక్షితార్ శ్యామశాస్త్రి, అన్నమయ్య, రామదాసు రచించిన కీర్తనలను గానం చేశారు. పెరవలి నందకుమార్ వయోలిన్‌పై, కందుల అనిల్‌కుమార్ మృదంగంపై సహకరించారు. నారదగాన సభ వ్యవస్థాపకుడు డాక్టర్ ఆకురాతి కోదండ రామయ్య, సంగీత విద్వాంసులు మోదుమూడి సుధాకర్, విష్ణుభొట్ల సోదరీ మణులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న జానపద గీతాలు



విజయవాడ కల్చరల్: జానపద దామోదరం, మామ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జానపద దినోత్సవం సందర్భంగా గాంధీనగర్ హనుమంతరాయ గ్రంథాలయంలో శనివారం నిర్వహించిన జానపద, సినీ గీతాల కార్యక్రమం ఆకట్టుకుంది. జానపద గాయకుడు దామోదర గణపతిరావు ఆధ్వర్యంలో గాయనీ గాయకులు ఒమ్మి రమాశంకర్, రమణ, రూపాశ్రీ, సుశీల, కృష్ణ సింధూ, ప్రజ్ఞ సినీ గీతాలను ఆలపించారు. వాయిద్యకళాకారుడు డాక్టర్ సురేష్ కుమార్ శాక్సోఫోన్ ఫ్లూట్‌పై సంప్రదాయ కీర్తనలను ఆలపించారు. గాయకుడు గణపతిరావు, డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి, గోళ్ల నారాయణరావు, ఏపీ ఫిలిం చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు అంబటి మధుమోహన కృష్ణ జానపద గీతాల వైభవం అంశంగా ప్రసంగించారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ఎస్‌బీఐ కొత్తపేట శాఖ మేనేజర్ సంతోష్‌కుమార్ అన్నారు. కొత్తపేట హిందూ హైస్కూల్‌లో తెలుగు భాషా దినోత్సవ వారోత్సవాలను పాఠశాలలోని శ్రీనాథాంధ్ర భాషా సమితి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా తెలుగు ఖ్యాతిని నలుదిశల వ్యాపింపజేసిన ప్రముఖులు, కవుల వేషధారణలతో విద్యార్థులు అలరించారు. అదేవిధంగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కొత్తపేట బ్రాంచ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు 50 మొక్కలను పంపిణీ చేసి వాటి పరిరక్షణ బాధ్యతలు చేపట్టాలని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు చెప్పారు. తెలుగు ఉపాధ్యాయులు కె. శ్రీనివాస్, డాక్టర్ ఎస్. వెంకటేశ్వరరావు, డాక్టర్ కె కృష్ణ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

గిరిజన జీవితాల్లో మార్పునకు నాంది

భవానీపురం(విజయవాడపశ్చిమ): పార్వతీపురం మన్యం జిల్లాలోని సాలూరు నియోజకవర్గం పరిధిలో కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం స్థాపన ద్వారా గిరిజనుల జీవితాల్లో విప్లవాత్మకమైన మార్పునకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాంది పలికారని ఎస్టీ కార్పొరేషన్ ట్రికార్ డైరెక్టర్ మద్దిల రామకృష్ణ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గిరిజనుల అభివృద్ధిపై వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఎంతో బాధ్యతగా, దూరదృష్టితో వ్యవహరిస్తోందన్నారు. రాజకీయంగానూ ఎస్టీలకు సీఎం జగన్ పెద్దపీట వేశారని కొనియాడారు.

నేడు తెలుగు భాషా దినోత్సవం

విజయవాడ కల్చరల్: దుర్గాపురంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ నృత్య సంగీత కళాశాలలో గిడుగు రామ్మూర్తి జయంతి సందర్భంగా ఆదివారం తెలుగు భాషోత్సవం నిర్వహిస్తున్నట్లు వేము ల ట్రస్టీ సభ్యురాలు వేముల లక్ష్మీ సరోజ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం, వేముల ఛారిటీస్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో అధికార భాషా సంఘం అధ్యక్షుడు పి. విజయబాబు, సెంట్రల్ ఎమ్మె ల్యే మల్లాది విష్ణు, సాహితీవేత్తలు పాల్గొంటారన్నారు.

నైపుణ్య శిక్షణ.. ఉపాధికి ఆలంబన



విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న దృశ్యం(ఫైల్ ఫొటో)



సొంతంగా ప్రింటింగ్ చేసిన క్లాత్‌ను చూపుతున్న విద్యార్థినులు

- విద్యార్థుల ఆర్థిక స్వావలంబనకు కృషి
- విద్యతో పాటు పలు అంశాలలో ఉచిత శిక్షణ
- గురుకుల సాంఘిక సంక్షేమ కళాశాలలో వినూత్న కార్యక్రమం

మధురానగర్(విజయవాడసెంట్రల్): గురుకుల సాంఘిక సంక్షేమ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు విద్యతోపాటు ఉపాధి ఆధారిత శిక్షణ ఇస్తూ వారి నైపుణ్యాలు వృద్ధి చెందించేందుకు కృషి చేస్తున్నారు. మాచవరం ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలోని కంచికచర్ల గురుకుల సాంఘిక సంక్షేమ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 200మంది విద్యార్థినిలు విద్యను అభ్యసిస్తున్నారు. వీరంతా నిరుపేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు కావటంతో.. ఆర్థికంగా ఇబ్బందులు పడకూడదనే సదుద్దేశంతో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వల్లూరు నీరజ జన శిక్షణ సంస్థాన్ సహకారంతో ఆసక్తి ఉన్న విద్యార్థినులకు జ్యూస్ తయారీ, టెక్స్‌టైల్స్ ప్రింటింగ్‌లో ఉచితంగా శిక్షణ ఇప్పిస్తున్నారు. శిక్షణ పూర్తిచేసుకున్న విద్యార్థినులకు సర్టిఫికెట్లు కూడా అందజేస్తున్నారు. దీంతో విద్యార్థినులు ఒక పక్క చదువుకుంటూనే మరో పక్క వారు నేర్చుకున్న జ్యూస్ తయారీ, టెక్స్‌టైల్స్ ప్రింటింగ్ ద్వారా ఆదాయం పొందుతున్నారు. వారి వ్యక్తిగత ఖర్చుల కోసం కుటుంబంపై ఆధార పడకుండా స్వయం ఉపాధి దిశగా సాగుతున్నారు. ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగే కార్యక్రమాలు, పరీక్షల వ్యాల్యుయేషన్ తదితర సమయాలలో ఈ జ్యూస్‌ను సరఫరా చేస్తున్నారు. సహజసిద్ధమైన పదార్థాలతో తయారు చేసిన జ్యూస్ ఎంతో రుచిగా ఉంటుందని పలువురు చెబుతున్నారు.

సొంతంగా సంపాదన..



ఇక్కడ మాకు డిగ్రీతో పాటు ఉపాధి ఆధారిత శిక్షణ ఉచితంగా ఇస్తున్నారు. మాకు నేర్పించిన టెక్స్‌టైల్స్ ప్రింటింగ్, జ్యూస్ తయారీ ద్వారా కొంత డబ్బు సొంతంగా సంపాదించుకోగలుగుతున్నాం. జేబు ఖర్చుల కోసం ఒకరిపై ఆధారపడకుండా ఉండగలుగుతున్నాం.

– వై. జయలక్ష్మి, బీకాం ద్వితీయ సంవత్సరం

భవిష్యత్తుపై ఆందోళన లేదు..



డిగ్రీ చేతికి వచ్చిన తర్వాత ఉద్యోగం వస్తుందో రాదో అనే బెంగ లేకుండా ఉపాధి ఆధారిత శిక్షణలు ఇస్తున్నారు. వీటి వల్ల భవిష్యత్తుపై ఆందోళన ఉండదు. అలాగే మాకు ఆపద సమయంలో మమ్మల్ని మేము రక్షించుకునేందుకు కరాటే సైతం నేర్పించారు.

– ఏసుమణి, బీకాం తృతీయ సంవత్సరం

వ్యాపారవేత్తలుగా ఎదగాలి..



ఇక్కడ సాధారణ నిరుపేద కుటుంబాలకు చెందిన విద్యార్థినులు విద్యను అభ్యసిస్తున్నారు. ప్రభుత్వం అన్ని వసతులు సమకూర్చినప్పటికీ వారి సొంత ఖర్చులకు ఇంటి వారిపై ఆధారపడకుండా జనశిక్షణ సంస్థాన్ సహకారంతో టెక్స్‌టైల్స్ ప్రింటింగ్, జ్యూస్ తయారీలో శిక్షణ ఇప్పించాం. మా విద్యార్థులు సహజ సిద్ధమైన పదార్థాలతో జ్యూస్‌ను రుచికరంగా తయారు చేయటంతో పాటు టెక్స్‌టైల్స్ ప్రింటింగ్‌లో మంచి డిజైన్‌లు రూపొందిస్తున్నారు. భవిష్యత్తులో మంచి వ్యాపార వేత్తలుగా ఎదగటంతో పాటు మరో పదిమందికి ఉపాధి కల్పించేలా విద్యార్థులు ఎదగాలన్నదే లక్ష్యం.

–డాక్టర్ వల్లూరు నీరజ, కళాశాల ప్రిన్సిపాల్

మోడల్ డివిజన్‌గా తీర్చిదిద్దుతున్నాం

- అభివృద్ధిని చేతల్లో చూపుతున్నామన్న ఎమ్మెల్యే వెలంపల్లి
- 45వ డివిజన్‌లో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



సీసీ రోడ్ నిర్మాణానికి కొబ్బరికాయ కొడుతున్న మాధురి లావణ్య, చిత్రంలో ఎమ్మెల్యే వెలంపల్లి

భవానీపురం(విజయవాడపశ్చిమ): గత ప్రభుత్వ హయాంలో నగరాభివృద్ధి శూన్యమని, వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాతే అభివృద్ధి అంటే ఏమిటో ప్రజలకు అవగతం అయ్యిందని ఎన్టీఆర్ జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు వెలంపల్లి శ్రీనివాస రావు అన్నారు. శనివారం ఆయన 45వ డివిజన్ కార్పొరేటర్ మైలవరపు మాధురి లావణ్య, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బందితో కలిసి డివిజన్‌లో పర్యటించారు. రూ.33.69 లక్షల నిధులతో స్థానిక ద్వారక వీధిలో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్‌కు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వెలంపల్లి మాట్లాడుతూ గతంలో డివిజన్ పరిస్థితి అధ్వానంగా ఉండేదని, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొండ ప్రాంతంలో నూతనంగా మెట్లు, డ్రెయిన్లు, ర్యాంప్‌లు అభివృద్ధి చేశామని తెలిపారు. రోటరీనగర్‌లో కమ్యూనిటీ హాల్ నిర్మాణం పూర్తయితే డివిజన్ ప్రజలకు అన్ని విధాల ప్రయోజనకరంగా ఉంటుందని చెప్పారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఈ డివిజన్‌లో ఇంటింటికీ తిరిగినప్పుడు స్థానికులు తెలియచేసిన సమస్యల్లో చాలా వరకు పరిష్కరించామని అన్నారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలను కూడా అతి త్వరలో పరిష్కరిస్తామని చెప్పారు.

ఖాళీ స్థలాల యజమానులకు నోటీసులిస్తాం

డివిజన్ పరిధిలో అనేక ప్రైవేట్ స్థలాలు ఖాళీగా ఉన్నాయని, వాటిల్లో మురుగునీటితోపాటు వర్షపు నీరు నిలిచి ఆరోగ్య సమస్యలు ఎదురవుతున్నట్లు స్థానికులు ఫిర్యాదు చేస్తున్నారని అన్నారు. ఆయా ఖాళీ స్థలాల యజమానులకు నోటీసులిచ్చి మెరక చేయించుకునేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. బృందావన్ కాలనీ రోడ్ నిర్మాణ పనులు శరవేగంతో జరుగుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో 45వ డివిజన్ బాధ్యులు మైలవరపు కృష్ణ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మైలవరపు దుర్గారావు, దుర్గగుడి ధర్మకర్త కట్టా సత్తెయ్య, పార్టీ నాయకులు బైపినేని కోటేశ్వరరావు, ముత్తా వాసు, బోర మల్లేశ్వరరెడ్డి, దుర్వేసుల హుస్సేన్, నల్లం వాసు, డబ్బాడ రాము, బుజ్జి, సీహెచ్ లక్ష్మణ్, డాక్టర్ రత్నమాచారి, యు. దుర్గారావు, ఫణి, నక్కా ప్రభుదాస్, యరజర్ల మురళి, రవ్వా కోటేశ్వరి, పి. కోటేశ్వరి అధికారులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న జూనియర్ సివిల్ జడ్జి జ్యోతి

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): ప్రజల్లో చట్టాలపై అవగాహన కల్పించేందుకే న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహిస్తున్నట్లు అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి నామాల జ్యోతి అన్నారు. శనివారం సత్యనారాయణపురంలోని ఏకేటీపీ మున్సిపల్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. చట్టం ముందు ప్రతి ఒక్కరూ సమానమేనని, అన్యాయానికి గురైన బాధితులకు ఈ న్యాయ విజ్ఞాన సదస్సులో ఉచితంగా న్యాయపరమైన సలహాలను అందిస్తామన్నారు. చాలా వరకు చట్టాల గురించి తెలియపోవడంతోనే ప్రజలు ఎన్నో నేరాలకు పాల్పడుతున్న ఘటనలు జరుగుతున్నాయని అన్నారు. విద్యార్థులు చిన్న వయస్సు నుంచే చట్టాలు, వాటిపై విధించే శిక్షల గురించి తెలుసుకుంటే నేరాలకు దూరంగా ఉండవచ్చన్నారు. బాల్య వివాహాలు, మానవ అక్రమ రవాణ, మత్తు పదార్థాల వినియోగం తదితర అంశాలపై విద్యార్థులకు క్లుప్తంగా వివరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసరావు, ఎస్ఎన్‌పురం ఉమెన్ ఎస్ఐ దుర్గాభవానీ, విద్యార్థులు పాల్గొన్నారు.

నిరాధార వార్తలు రాస్తే సహించేది లేదు

నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ రాయన భాగ్యలక్ష్మి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు, ముఖ్యంగా మహిళా కార్పొరేటర్లను కించపరిచే విధంగా నిరాధార వార్తలు రాస్తే సహించేది లేదని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి హెచ్చరించారు. రాజకీయ వ్యూహాలు ఉంటే మరోలా చూసుకోవాలని, మహిళల వ్యక్తిగత విషయాల్లోకి రావడం సరికాదన్నారు. పచ్చ పత్రికలో వచ్చిన కథనాన్ని ఆమె తీవ్రంగా ఖండించారు. శనివారం భవానీపురంలోని వైఎస్సార్ సీపీ జిల్లా పార్టీ కార్యాలయంలో కార్పొరేటర్లతో కలిసి మీడియాతో మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళలను అన్ని విధాల ప్రోత్సహిస్తున్నారన్నారు. పార్టీలోనూ, పదవుల్లోనూ సముచిత స్థానం కల్పించారన్నారు. మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించారన్నారు. ఇంటిని చక్కదిద్దినట్లే పాలనా వ్యవహారాలను చక్కదిద్దగలరన్న భరోసాతో మహిళలను ఉన్నత స్థానాల్లో కూర్చుబెట్టారన్నారు. కానీ పచ్చపత్రికలు, పనికిమాలిన తోక పార్టీలు పనిగట్టుకుని మహిళలపై దుష్ప్రచారం చేస్తున్నాయన్నారు. మహిళలపై దాడులు జరుగుతున్నాయని త ప్పుడు రాతలు రాస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చే శారు. వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లంతా ఒకే కుటుంబంలోని వ్యక్తుల్లా కలిసి మెలిసి ఉంటున్నామన్నారు. పత్రికలు రాసిన నిరాధార కథనాలు, ప్రతిపక్ష పార్టీలు చేసిన అసత్య ఆరోపణలను నిరూపించాలని సవాల్ విసిరారు. గతంలో టీడీపీ కార్పొరేటర్లు యాత్రలకు వెళ్లి ఏమేమి ఘన కార్యాలు చేశారో నగరంలో ప్రతి ఒక్కరికీ తెలుసునన్నారు. గతంలో ఎన్నికల ముందు పచ్చ పత్రికలు ఇలాంటి రాతలే రాశాయని, మళ్లీ ఎమ్మెల్యే ఎన్నికలు సమీపిస్తుండటంతో తప్పుడు రాతలు రాస్తున్నాయని దుయ్యబట్టారు.

దిగజారుడు రాజకీయాలు మానుకోవాలి..

ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ బండి పుణ్యశీల మాట్లాడుతూ పోతిన మహేష్ దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారన్నారు. కార్పొరేటర్ల ను బ్లేమ్ చేస్తే సహించేది లేదన్నారు. కార్పొరేటర్లు పడిగపాటి చైతన్యరెడ్డి, యరడ్ల ఆంజనేయ రెడ్డి, అర్షద్ మాట్లాడారు. కార్పొరేటర్లు బాలసాని మణెమ్మ, గుడివాడ నరేంద్ర, ఎండీ ఇర్ఫాన్, బాపతి కోటిరెడ్డి, మైలవరపు రత్నకుమారి, మైలవరపు మాధురి లావణ్య, గోదావరి గంగా, మరుపిల్ల రాజేష్, మహదేవ్ అప్పాజీ రావు, పార్టీ నాయకులు దుర్గారావు, తంగెళ్ల రామచంద్ర రావు, మైలవరపు కృష్ణ,గోదావరి బాబు తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాల నిర్వహణ అభినందనీయం



భవానీపురం(విజయవాడ పశ్చిమ): నగరంలోని వివిధ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్, ట్రస్ట్‌లు, ఫౌండేషన్లకు గౌరవ అధ్యక్షులుగా వ్యవహరిస్తూ పలు రైతుబజార్లలో ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించిన వావిలాల రజనీకాంత శర్మను వ్యవసాయ మార్కెటింగ్ శాఖ జిల్లా అధికారి కె. మంగమ్మ ప్రశంసించారు. శనివారం గొల్లపూడిలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆమె వావిలాలకు ప్రశంసా పత్రాన్ని అందజేసి అభినందించారు. పలు రైతుబజార్లలో ఆర్థో, న్యూరో, హార్ట్, బ్రెయిన్ సమస్యలపై ఉచిత వైద్య సేవ శిబిరాలను నిర్వహించటం ద్వారా రైతులు, స్టాల్స్ నిర్వాహకులు, వినియోగదారులు ఎన్నో ప్రయోజనాలను పొందారని వివరించారు.

మాతృభాషతో మానవ వికాసం



మాట్లాడుతున్న డాక్టర్ సురేష్‌బాబు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు మాతృభాషతో మానవ వికాసం సాధించగలరని కేంద్ర సాహిత్య అకాడమీ డెప్యూటీ సెక్రటరీ డాక్టర్ నారాయణం సురేష్‌బాబు అన్నారు. కాకరపర్తి భావనారాయణ కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో గిడుగు రామ్మూర్తి పంతులు జయంతిని పురస్కరించుకొని తెలుగు భాషా దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ నారాయణం సురేష్ బాబు మాట్లాడుతూ మాతృభాషను నిర్లక్ష్యం చేయటం ద్వారా మన వికాసానికి మనమే అడ్డుపడిన వారమవుతామన్నారు. మాతృభాషలో విద్యాబోధనపై కేంద్ర మానవ వనరుల శాఖ అనేక కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. సీబీఎస్ఐ ఇప్పటి వరకూ ఇంగ్లిష్‌లో మాత్రమే బోధన ఉండేదన్నారు. కానీ రానున్న రోజుల్లో మాతృభాషలోనే సీబీఎస్ఈ సిలబస్‌ను మార్పు చేయటానికి కసరత్తు జరుగుతోందన్నారు. కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పీఎల్ రమేష్, అధ్యాపకులు డాక్టర్ కప్పగంతు రామకృష్ణ ప్రసంగించారు. కార్యక్రమంలో జూనియర్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ టి. భాగ్యకుమార్ పాల్గొన్నారు.

మానవతావాది మదర్ థెరీసా



బీసీ భవన్‌లో మదర్ థెరీసా చిత్రపటానికి పూలమాల వేస్తున్న శ్రీకాంత్

భవానీపురం(విజయవాడపశ్చిమ): అనాథలు, అభాగ్యులను నిండు మనసుతో ఆదరించి అక్కున చేర్చుకుని సేవలు అందించిన గొప్ప మానవతావాది మదర్ థెరీసా అని ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ తోలేటి శ్రీకాంత్ అన్నారు. మదర్ థెరీసా జయంతిని పురస్కరించుకొని గొల్లపూడిలోని బీసీ సంక్షేమ భవన్‌లోగల ఆయన కార్యాలయంలో శనివారం థెరీసా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ కష్టాల్లో ఉన్నవారిని వెతికిమరీ సాయం చేసిన విశ్వమాత మదర్ థెరీసా అన్నారు. బీసీ నాయకులు కోసూరి రమేష్, కత్తురోజు సతీష్, జె శ్రీనివాస్, వెంకటేశ్వరరావు, అవినాష్, రమేష్ తదితరులు ఉన్నారు.

హెచ్‌బీకాలనీ ఎలిమెంటరీ పాఠశాలలో..

స్థానిక హౌసింగ్‌బోర్డ్‌కాలనీలోగల మోహన్‌లాల్ చంద్ర బాగ మున్సిపల్ ఎలిమెంటరీ పాఠశాలలో మదర్ థెరీసా జయంతి వేడుకలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఇబ్రహీంపట్నం జూపూడిలోని నిమ్రా మెడికల్ కాలేజీ ప్రొఫెసర్ కె. వినయ్ బాబు పాల్గొని మదర్ థెరీసా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

గుప్తా సామాజిక సేవలు అభినందనీయం

రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు మల్లాది విష్ణు



హజరత్తయ్యకు పురస్కారం అందజేస్తున్న ఎమ్మెల్యేలు వెల్లంపల్లి, మల్లాది, మేయర్ రాయన

విజయవాడ కల్చరల్: న్యాయవాది వేముల హజరత్తయ్య గుప్తా సామాజిక సేవలను ఆదర్శంగా తీసుకోవాలని రాష్ట్ర ప్లానింగ్ బోర్డ్ ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. మానసా సాంస్కృతిక సేవా సంస్థ 22వ వార్షికోత్సవం సందర్భంగా తెలుగు సాహితీ రంగంలో సేవలను అందించిన వారికి భాషా పురస్కారాల కార్యక్రమాన్ని శనివారం గాంధీనగర్ చిట్టూరి హైస్కూల్‌లోని కళావేదికపై నిర్వహించారు. న్యాయావాది వేముల హజరత్తయ్య గుప్తాకు జీవిత సాఫల్య పురస్కారం ప్రదానం చేశారు. మల్లాది విష్ణు మాట్లాడుతూ ప్రభుత్వం కళాకారుల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ కళాకారుల ఆత్మబంధువు గుప్తాగా అభివర్ణించారు. నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, డాక్టర్ సమరం గుప్తా సామాజిక సేవలను కొనియాడారు. అనంతరం తెలుగు సాహిత్యంలో సేవలను అందించిన 15 మందికి భాషా పురస్కారాలను అందించారు. కార్యక్రమాన్ని అధ్యాపకులు వలివేటి శివరామకృష్ణ, సంస్థ వ్యవస్థాపకుడు సీహెచ్‌వీ బ్రహ్మానందరావు, కళాకారుల ఐక్యవేదిక ప్రధాన కార్యదర్శి బోడి ఆంజనేయరాజు నిర్వహించారు.

29 నుంచి సంగీత మహోత్సవాలు

విజయవాడ కల్చరల్: లయనాద కళా స్రవంతి సంగీత సంస్థ ఆధ్వర్యంలో సంగీత విద్వాంసుడు లంకా వేంకటేశ్వర్లు సంగీత మహోత్సవాలను నిర్వహిస్తున్నట్లు సంస్థ ప్రధాన కార్యదర్శి మాధవి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 29వ తేదీ నుంచి ఐదు రోజులపాటు దుర్గాపురం రామానగర్‌లోని శివరామకృష్ణ క్షేత్రంలో మహోత్సవాలు కొనసాగుతాయన్నారు.

ఉరి వేసుకుని యువకుడు ఆత్మహత్య

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): ఆర్థిక ఇబ్బందులతో యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటనపై ఎస్ఎన్‌పురం పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం కటారి వెంకట సాయి (27) బీఆర్టీఎస్ రోడ్డులోని ఒక ఆటో ఫైనాన్స్ కంపెనీలో పనిచేస్తూ శ్రీనగర్ కాలనీ, 2వ లైన్‌లో తల్లిదండ్రులతో కలసి నివాసముంటున్నాడు. మద్యానికి, చెడు వ్యసనాలకు బానిస అయ్యాడు. ఇటీవల అప్పులతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నట్లు తల్లిదండ్రుల వద్ద బాధపడుతుండేవాడు. ఈ క్రమంలోనే శుక్రవారం రాత్రి 9.30 గంటలకు భోజనం చేసి మేడపైన గదిలో పడుకోడానికి వెళ్లాడు. శనివారం ఉదయం తల్లి రూం శుభ్రపరిచేందుకు కొడుకు గదిలోకి వెళ్లగా చున్నితో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని వేలాడుతూ కనిపించాడు. కుటుంబ సభ్యులు, స్థానికుల సహాయంతో కిందికి దింపి చూడగా అప్పటికే మృతిచెంది ఉన్నాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

30న లలితాంబికకు పంచామృత అభిషేకాలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): నిజ శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకొని 30వ తేదీ బుధవారం లలితాంబిక అమ్మవారికి పంచామృత అభిషేకాలు నిర్వహిస్తున్నట్లు పీఠాధీశ్వరి శివలీల మాత పేర్కొన్నారు. పాలప్రాజెక్టు క్వార్టర్స్ సమీపంలో బుధవారం సాయంత్రం 5.30 గంటలకు అమ్మవారికి పంచామృతాలు, పసుపు, కుంకుమ, మూలికా జలాలతో అభిషేకాలు, విశేష కుంకుమార్చన నిర్వహిస్తామన్నారు. శ్రావణ మాసంలో అమ్మవారికి జరిగే విశేష పూజల్లో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొనాలని పీఠం కన్వీనర్ రాంపిళ్ల చైతన్య కోరారు.

నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు తమ నైపుణ్యాలను పెంపొందించుకున్నప్పుడే చక్కని భవిష్యత్‌ను సొంతం చేసుకుంటారని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు శ్రీపతి జగదీష్ అన్నారు. పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఎన్ఎస్ఎస్ యూనిట్స్ ఆధ్వర్యంలో జిల్లా యువజన సర్వీసుల శాఖ సహకారంతో కెరీర్ గైడెన్స్, వ్యక్తిత్వ వికాసంపై సదస్సును శనివారం ఆ కళాశాల ప్రాంగణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీపతి జగదీష్ మాట్లాడుతూ విద్యార్థులు తమతమ రంగాలకు సంబంధించిన అంశాలపై పట్టు సాధించాలన్నారు. జిల్లా యువజన సర్వీసుల శాఖ సహాయ మేనేజర్ నిమ్మగడ్డ నాగేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు స్వీయ అవగాహనతో నిర్ణయం తీసుకునే దిశగా తమ నైపుణ్యాలకు పదును పెట్టాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జె. లక్ష్మీనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ పతంజలిశాస్త్రి ఎన్ఎస్ఎస్ పీవో పీఓటీ శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.